# 12. సౌందర్యం


"అదృష్టమంటే అసలు అందం అంటే ఏమిటో
తెలిసిన వ్యక్తి మనకి ఎదురవడం
ఆనందం అంటే మనల్ని చూసి అతని గుండె
ఒక్క క్షణం ఆగిందని మనకి అర్థమవడం"

ఆఫీసులో పని చేసుకుంటూండగా మనసులో మెదిలిన ఆ వాక్యాలకు చిత్ర పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. ఎప్పుడో పదిహేనేళ్ళ క్రితం డిగ్రీ ఫైనల్ యియర్‌లో వున్నపుడు రాసుకున్న వాక్యాలవి.

ఆరోజు.... క్లాస్ జరుగుతూండగా తోచింది మనసులో ఈ భావం. నోట్ బుక్‌లో రాస్తూంటే... ప్రక్కనుంచి గాయత్రి తొంగి చూసి "ఎంత బాగా వ్రాశావే!" అంది.

గాయత్రి అందంగానే వుంటుంది. కానీ చిత్రకి వున్నంత అపురూపమయిన సౌందర్యం లేదు. అందుకే ఆ వాక్యాలను వ్రాసుకునే హక్కూ, ఆ అనుభవాన్ని గూర్చి కలలు గనే హక్కూ తనకి వుండవచ్చు కానీ గాయత్రికి వుండకూడదనిపించింది చిత్రకి.

ఆ వాక్యాలు తనకి కలిగించినంత పారవశ్యం గాయత్రికీ కలిగించడం కొంచెం నవ్వు తెప్పించింది కూడా.



కవితలు వ్రాసే అలవాటుంది చిత్రకి. ఇలాగే మొదట ఒక చిన్న భావం మదిలో తళుక్కు మంటుంది. నాలుగైదు లైన్లు తన ప్రమేయమేమీ లేకుండానే అలవోకగా కాగితం మీదకి జారతాయి. ఆ తర్వాత... ఒక రోజుకో, నెలకో, ఒక్కోసారి సంవత్సరానికో ఆ నాలుగు లైన్లూ ఇరవైగా, ముప్పైగా పెంచబడి ప్రచురించబడతాయి.

కానీ ఈ భావం! ఈ భావం మాత్రం ఆ రోజునుంచి ఈ రోజు వరకూ అలాగే వుండి పోయింది.

అపుడపుడూ ఆ వాక్యాలు గుర్తొస్తాయి. చిత్ర పెదవులు మనోహరమైన నవ్వుతో మెరుస్తాయి. అంతే. అంతకుమించి ఆ భావానికి మోక్షం రాలేదు. 'కవిత' గా మారి ప్రచురణకి నోచుకోలేదు.

అంతే కాదు... అంత అందమైన ఆ భావం.... కన్నె పిల్లగా కలలు కంటూన్నపుడు మనసులో మెదిలిన ఆ భావం.... ఈ నాటి వరకూ అనుభవం లోకీ రాలేదు!

పెళ్ళయింది. ముద్దులు మూట కట్టే పిల్లలకి తల్లీ అయింది. కానీ... అద్భుతమైన ఈ భావన మాత్రం యింతవరకూ అనుభవంలోకి రానేలేదు!!

జ్ఞాపకాలన్నిటినీ ప్రక్కకి తరిమి హేమంత్ కి మెయిల్ టైప్ చేసింది చిత్ర. క్రొత్తగా మొదలవుతున్న ప్రాజెక్ట్‌కి సంబంధించి చాలా సందేహాలున్నాయి. అవన్నీ హేమంత్ ఒక్కడే క్లియర్ చేయగలడు. అయితే అతనుండేది ఢిల్లీలో. ఒకపట్టాన ఫోన్‌లో కూడా దొరకడు.

ప్రాజెక్ట్ డిలే అయిపోతోందని టీంలోని వారంతా మూడు నెలలుగా టెన్షన్ పడుతున్నారు. హఠాత్తుగా తెలిసింది. హేమంత్ రేపు హైద్రాబాద్ వస్తున్నాడనీ... రోజంతా ఇక్కడే వుంటాడనీ.

"మంచి అవకాశం. మనం వదులుకోగూడదు" అన్నాడు చిత్రా వాళ్ళ మానేజర్.

అతన్ని చూస్తామన్న ఆలోచనే గొప్ప వుద్వేగాన్ని కలిగిస్తోంది టీంలో. అతని గురించి చాలా విషయాలు వింది చిత్ర.. ఎవరూ ఆలోచించని విధంగా ఆలోచిస్తాడట. ఏ విషయాన్నైనా అద్భుతంగా విశ్లేషిస్తాడట. పదిమంది పది రకాలుగా చర్చించి తీసుకున్న నిర్ణయం, అతను ఒక్క నిమిషంలో చూపించిన క్రొత్త కోణంతో వీగిపోతుందట.

చిత్ర పంపించిన మెయిల్‌కి పావుగంటలో రిప్లై వచ్చింది హేమంత్ నుంచి... మర్నాడు ఒక గంట సేపు వాళ్ళ టీం తో మాట్లాడేందుకు అంగీకరిస్తూ. మేనేజర్ దగ్గరికి వెళ్ళి చెప్తే.. "అతనంతే. చాలా ఫాస్ట్... చాలా టాలెంటెడ్" అంటూ మళ్ళీ ఓ అయిదు నిమిషాలపాటు హేమంత్ గుణగణాలని కీర్తించాడాయన.

చిత్రకి చాలా ఆశ్చర్యంగా అనిపించింది. ఒక మనిషిని ఇంతమంది ఏకగ్రీవంగా పొగడడం ఆమె మొదటిసారి చూస్తోంది.

తిరిగి తన సీట్ దగ్గరికి వస్తుంటే మధు, సునీల్ మాట్లాడుకోవడం వినిపించింది. "హేమంత్ తెలుగువాడా! నేను నార్త్ యిండియన్ అనుకుంటున్నాను ఇప్పటిదాకా!" అంటున్నాడు సునీల్.

"తెలుగు వాడే. చాలా ఏళ్ళ క్రితమే ఢిల్లీలో సెటిల్ అయ్యాడు. పెళ్ళి కూడా... ఎవరో బెంగాలీ అమ్మాయిని చేసుకున్నాడట." మధు వివరించాడు.

"బెంగాలీ అమ్మాయిలు అందంగా వుంటారని కాబోలు." అన్నాడు సునీల్.

మధు నవ్వాడు. "కావచ్చు. అతను కూడా చాలా అందంగా వుంటాడు. ప్రతి విషయాన్నీ సునిశితంగా చూసేవాళ్ళు దేనికీ కాంప్రమైజ్ అవరు కదా! అందం అంటే ఏమిటో అలాంటి వాళ్ళకే తెలియాలి మరి!"

మధు మాటలకి చిత్ర వులిక్కి పడింది. ఆమెకి మళ్ళీ తను పూర్తి చేయకుండా వదిలేసిన కవిత గుర్తొచ్చింది.

"అదృష్టమంటే అసలు అందం అంటే ఏమిటో తెలిసిన వ్యక్తి మనకి ఎదురవడం."

"అందం అంటే ఏమిటో తెలిసిన వ్యక్తిని చూడబోతుందా రేపు తను!"

చిత్రకి నవ్వొచ్చింది. "ఎంతగా వెంటాడుతోంది ఈ భావన తనని! తనే కాదు గాయత్రి కూడా గుర్తు పెట్టుకుంది ఇప్పటివరకూ ఆ వాక్యాలని."

నెలరోజుల క్రితం గాయత్రి చిత్ర దగ్గరికి వచ్చినపుడు ఆ విషయమే మాట్లాడింది. "ఆ కవిత అలా పూర్తి చేయకుండా వదిలేశావెందుకే!" అని అడిగింది.

"అది యింక పూర్తి కాదులే" అంది చిత్ర పెదవి విరుస్తూ.

'ఏం!' గాయత్రి విస్మయంగా అడిగింది.

"ఊహించుకున్న ప్రతి భావనా ఏదో ఒకనాడు అనుభవించాను. ఆ అనుభవాన్నే కవితగా మలిచాను. ఈ ఒక్క భావమే వూహగా మిగిలిపోయింది. అనుభవంలోకి రాని భావం కవితగా మారదేమో!" అంది చిత్ర.

గాయత్రి నవ్వి, "సరే. అలా అయితే అనుభవంలోకి వచ్చినపుడే వ్రాయి" అంది.

చిత్ర కొంచెం చిరాకుగా చూసింది గాయత్రి వైపు. ముప్ఫై అయిదేళ్ళు దాటాయి. భర్తల నుంచి ఆ ప్రశంస వస్తుందన్న ఆశ లేదు. అసలు వాళ్ళకి అందం గురించి తెలుసేమోనన్న అనుమానమూ లేదు. మరింకెవరు తమ అందాన్ని గుర్తించేవారు! తమకి ఆనందాన్నీ, గర్వాన్నీ కలిగించేవారు!

నిరాశా, ఉక్రోషమూ మిళితమైన గొంతుతో "ఇప్పుడు! ఇంక ఈ వయసులో!" అంది కచ్చగా.

"అందానికి వయసుతో పనేముంది!" అంది గాయత్రి చెరగని మందహాసంతో, చిత్ర రుసరుసలని పట్టించుకోకుండా.

ఒక్క క్షణం గాయత్రి వైపు తేరిపార చూసింది చిత్ర.. వెంకటగిరి జరీచీర. నుదుట కుంకుమ బొట్టు... ముక్కుపుడక. తెరలు తెరలుగా వచ్చిన నవ్వుని చిత్ర ఆపుకోలేదు.

జుట్టుని చక్కటి షేప్‌లో కట్ చేసుకుని క్లిప్ పెట్టుకోవడం కూడా తెలీదు గాయత్రికి. ఇప్పటికీ జడే వేస్తుంది. పదిహేనేళ్ళ క్రితం వేసుకున్నట్లు చిన్న మెడతో వున్న బ్లౌజ్ వేసుకుంటుంది. పెళ్ళయ్యాక పాపిట్లో సింధూరమూ. మెడలో నల్లపూసల్లాంటివి క్రొత్తగా వచ్చి చేరాయి కానీ మిగతా వేషధారణ అంతా ఆనాటిదే.

ఇంత సౌందర్యం వున్న తనకి... ఇప్పటి ఫ్యాషన్స్ అన్నిటినీ ఫాలో అయ్యే తనకి లేని ఆశ గాయత్రికి వుండడం చూస్తే చిత్రకి నిజంగా నవ్వొచ్చింది.

"అబ్బో! ఇంకా అలాంటి అదృష్టమూ, ఆనందమూ ఎదురవుతాయన్న ఆశ వుందన్న మాట నీకు!" అంది వెక్కిరింపుగా.

"ఆశ కాదు. ఆశ దేని మీదా లేదు. అలా అని ఏ విషయం పట్లా 'ఇంకేముంది, అంతా అయిపోయింది' అన్న నిరాశా లేదు" అంది గాయత్రి.

"సరేలేవే నీ స్టేట్‌మెంట్లు" కసురుకుంది చిత్ర. 'అసలు అది ఎంత గొప్ప భావనో ఈ మొద్దుమొహానికి అర్థమయినట్లే లేదు. అద్దమయిన వెధవలూ చూసే వెకిలిచూపు లనుకుంటోంది కాబోలు. అలాంటివయితే లక్షలు చూశానీ జన్మలో'. మనసులోనే చిరాకుపడింది.

అదంతా గుర్తు చేసుకుంటే బాధగా అనిపించింది చిత్రకి. "నేనలా కసురుకున్నందుకు పాపం గాయత్రి ఏమనుకుందో ఏమిటో! ఒకసారి ఫోన్ చేయాలి" అనుకుంది.

మర్నాడు చిత్ర ఆఫీస్‌కి వచ్చేసరికే పదిన్నర అయింది. ఎంత హడావుడిగా తయారయి వచ్చినా లేట్ అయింది. హడావుడిగా తయారయిందా! ఉహు, నిజానికి రోజూకన్నా శ్రద్ధగా తయారయిందివాళ. "ఎందుకు!" తన మనసు మారుమూలల్లో నుంచి వినిపించిన ప్రశ్నకి చిత్ర వులిక్కిపడింది.

"ఇన్నాళ్ళుగా వూహించుకుంటూన్న అనుభవం ఈ రోజు ఎదురవుతుందని ఆశపడుతోందా!" ఆ ప్రశ్నకి సమాధానం దొరకక ముందే మీటింగ్‌కి టైం అయింది.

బ్లాక్ కలర్ శారీ.... మెడలో ముత్యాల హారం.. చూడగానే ఆమె భర్త నొసలు చిట్లించే రంగు. ఆ చీరలో తనెంత బాగుంటుందో చిత్రకి తెలుసు. కానీ ఈ రోజువరకూ ఆమె ఆశించిన గుర్తింపు దొరకలేదు.

మీటింగ్ రూం తలుపు తెరుచుకుని లోపలికి అడుగుపెడ్తుంటే... హేమంత్ తలెత్తి

చూశాడు. ఇన్నాళ్ళ నిరీక్షణ ఫలించింది! అతని కళ్ళల్లో తళుక్కుమన్న మెరుపు ఆమెకి స్పష్టంగా కనిపించింది!

మీటింగ్ పూర్తయింది. అన్ని విషయాలూ క్లారిఫై అయ్యాయి. టీం అంతా సంతోషంగా వున్నారు. చిత్రని మాత్రం ఆశించిన ఆనందం కాక తెలియని నిర్వేదం ఆవహించింది.

ఏడు గంటలవుతూండగా... తల పగిలిపోతూన్నంత నెప్పితో యింటికి బయల్దేరింది. సగం దూరం వచ్చాక గాయత్రి గుర్తొచ్చింది. కారు అప్రయత్నంగా దారి మార్చుకుంది.

హఠాత్తుగా వచ్చిన చిత్రనీ, ఆమె వైఖరినీ చూసి గాయత్రి ఆశ్చర్యపోయింది. "ఏంటే అలా వున్నావు!" అంది.

"ఎలా వున్నాను!"

"ఏదో విషప్రయోగం జరిగినదానిలా."

నీరసంగా నవ్వుతూ కుర్చీలో కూలబడి "నా సంగతి సరే కానీ నువ్వేంటీ అమృతం త్రాగినంత ఆనందంగా కన్పిస్తున్నావు?" అంది చిత్ర.

"అవునా! కనిపిస్తున్నానా! కారణం వుంది." చిత్రకి మంచినీళ్ళిచ్చి ప్రక్కనే కూర్చుంటూ చెప్పింది గాయత్రి. "పదిహేనేళ్ళ క్రితం నువు వూహించావు చూడు. ఆ భావన అనుభవం లోకి వచ్చిందివాళ నాకు."

"ఏమిటీ!" చిత్ర అదిరిపడింది.

"అవునే, నేనే నీకు ఫోన్ చేద్దామనుకున్నాను. తమాషాగా నువ్వే వచ్చేశావు." గాయత్రి చెప్పసాగింది.

"సాయంత్రం ఆరుగంటలపుడు ఈ ప్రక్కనే వున్న శివాలయానికి వెళ్ళాను. చిన్నగుడి. నిర్మానుష్యంగా, ప్రశాంతంగా వుంది ఆ సమయంలో. పూజారి చిన్న కుర్రాడు. పాతికేళ్ళు కూడా లేవేమో! నేను గుళ్ళోకి అడుగుపెడుతూంటే కళ్ళు విప్పార్చుకుని చూశాడు. నాకు తీర్థం యిచ్చి గుడి ఆవరణలోనే వున్న యింట్లోకి వెళ్ళాడు.

నేను దర్శనం చేసుకుని బయటికి వచ్చి చెట్ల దగ్గర కూర్చున్నాను. అతను కూడా యింట్లో నుంచి ఏవో పుస్తకాలు తీసుకుని బయటకి వచ్చాడు. "ఇక్కడే వుంటారా మీరు!" అని పలకరించాను.

"అవునండీ" అన్నాడు నాకు కొంచెం దూరంలో నిలబడి.

"ఇదివరకు వుండే పూజారిగారు..." సందిగ్ధంగా అడిగాను.

"మానాన్నగారు. పదిహేనేళ్ళుగా వున్నారండి ఇక్కడ. ఈ గుడిలో అమ్మవారిని చూస్తూనే పెరిగాను నేను. మొన్ననే చదువయిపోయి వుద్యోగంలో చేరాను. నాన్నగారికి హఠాత్తుగా పక్షవాతం వచ్చింది. ఆ బాధలో వుండగానే మా కంపెనీలో ఏవో గొడవలు. కంపెనీ మూతపడింది. ఉద్యోగం పోయింది. ఇంకో వుద్యోగం చూసుకోవాలనిపించలేదు నాకు. ఇక్కడ గుడికేమో సరైన పూజారి దొరకలేదు. ఒకాయన వచ్చి రెండు వారాలుండి వెళ్ళిపోయారు. ఇంకెవరైనా దొరుకుతారేమోనని వెతుకుతూంటే నేనే చూసుకుంటానని చెప్పాను." అన్నాడు.

నేనతని వైపు అభిమానంగా చూస్తూ "అమ్మవారు తనకి సేవ చేసే భాగ్యం యివ్వదల్చుకున్నపుడు అలాగే రప్పించుకుంటుంది" అన్నాను. "అధైర్యపడకు. మీ నాన్నగారికి త్వరగా నయమయిపోతుందిలే" అభయమిస్తున్న ధోరణిలో చెప్పాను.

తలవంచుకుని నాపాదాల వైపు చూస్తున్న అతను చప్పున తల ఎత్తాడు. అతని కళ్ళల్లో సన్నటి తడి తళుక్కుమంది.

"సాక్షాత్తూ అమ్మవారే వచ్చి చెప్తున్నట్లుగా వుందండీ నాకు!" అన్నాడు.

"అయ్యో ఇంకా నయం!" ఆ మాటకి ఇబ్బంది పడుతూ ఖండించాను నేను.

"కాదండీ. అమ్మ నాకీ ఓదార్పు మాట చెప్పాలంటే ఎలా చెప్తుంది! మీలాగా ఒక రూపంలో వచ్చే కదా! ఇందాక... సూర్యాస్తమయపు వెలుగులు మీ తల వెనుక ప్రకాశిస్తూండగా... పసుపు రాసుకున్న పాదాలతో మీరు గుడిలోకి అడుగు పెడుతూన్నపుడే నాకెందుకో శరీరం వణికినట్లయింది. ఒక్క క్షణం గుండె లయ తప్పింది. ఇపుడు మీరు ఈ మాట చెప్తుంటే అమ్మవారే ధైర్యం చెప్తూన్నట్లుగా వుంది" అన్నాడు."

చెప్పడం పూర్తి చేసి చిత్ర వైపు చూసింది గాయత్రి. "నిరంతరం ఆ జగన్మాత సౌందర్యాన్ని చూసి మురిసే ఆ అబ్బాయి... అందం అంటే ఏమిటో అందరికన్నా బాగా తెలిసినవాడు... నన్ను చూసి తన గుండె లయ తప్పిందని చెప్తూంటే నాకు ఎంత ఆనందంగా అనిపించిందో చెప్పలేనే! నిజానికి నువు వ్రాసిన ఆ వాక్యాల పూర్తి భావం నాకీరోజే అర్థమయిందనిపించింది." చెప్తూన్న గాయత్రి కంఠం వణికింది.

అప్పటివరకూ చిత్తరువులా కూర్చుని ఆమె మాటలు వింటూన్న చిత్ర ఒక్కసారిగా కదిలి గాయత్రి చేతిని గట్టిగా పట్టుకుంది. ఆమె భుజంపై తల ఆనిస్తూ "నీకే కాదు. నేను వ్రాసుకున్న ఆ వాక్యాల అసలు అందం నాకూ ఈ రోజే అర్థమయింది" అనుకుంది.

**- ఆకాశవాణి**

*29 ఆగస్ట్ 2011*